సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం । 18 । డిసెంబర్ । 2024



చీనీ టన్ను రూ.26,400

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.26,400, కనిష్టంగా రూ.11 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.13

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.13, కనిష్టంగా రూ.7, సరాసరిన రూ.9 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం

31.2°/9.3°

జిల్లాలో చలి వాతావరణం కొనసాగుతోంది. మంగళవారం ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ధర్మవరం పట్టుచీర అద్భుతం

- నేతన్న పనితనానికి ముగ్ధులైన ఢిల్లీ నిపుణుల కమిటీ సభ్యులు



పట్టుచీరను పరిశీలిస్తున్న ఢిల్లీ నిపుణుల కమిటీ సభ్యులు

ధర్మవరం: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ధర్మవరం పట్టుచీర అద్భుతంగా ఉందని ఢిల్లీ నుంచి వచ్చిన నిపుణుల బృందం కితాబు ఇచ్చింది. 'ఒక జిల్లా ఒక ఉత్పత్తి' అవార్డు కోసం స్థానిక డిజైనర్ నాగరాజు దరఖాస్తు చేసుకోగా, మంగళవారం ఢిల్లీ నుంచి ఓ బృందం ధర్మవరానికి వచ్చింది. కమిటీ సభ్యులు అరిష్టి గుప్త, జాస్మిన్ కౌర్ ధర్మవరంలో విస్తృతంగా పర్యటించారు. పట్టు గుడ్డు నుంచి పట్టుచీర తయారీ వరకు వివిధ దశలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా నేతన్నల పనితనానికి ఢిల్లీ నుంచి వచ్చిన ప్రతినిధులు ముగ్ధులయ్యారు. వారివెంట హ్యాండ్‌లూమ్ ఏడీ రామకృష్ణ, డీఓ రమణరెడ్డి, శీనా నాయక్, బీజేపీ నాయకులు జింక చంద్రశేఖర్, చేనేత కార్మికులు సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం ఎంఈఓ లైంగికంగా వేధిస్తున్నాడు

- ఎంజేపీ బాలిక పాఠశాల సహాయకురాలి ఫిర్యాదు
- కేసు నమోదు చేసిన పోలీసులు



ఎంఈఓ గోపాల్ నాయక్

పుట్టపర్తి: బుక్కపట్నం ఎంఈఓ-1 గోపాల్ నాయక్ తనను లైంగికంగా వేధిస్తున్నాడని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలలో సహాయకురాలు (అటెండర్)గా పని చేస్తున్న తాత్కాలిక ఉద్యోగిని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎంఈఓపై కేసు నమోదు చేసినట్లు బుక్కపట్నం ఎస్‌ఐ కృష్ణమూర్తి తెలిపారు. ఎంఈఓ గోపాల్‌నాయక్ ఇటీవల తనను అనేక సార్లు తన కార్యాలయానికి పిలిపించుకుని వేధింపులకు గురి చేసినట్లు బాధితురాలు పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పాఠశాలకు సంబంధించి వివరాల సేకరణ నిమిత్తం తన ఫోన్ నంబర్ తీసుకున్న ఎంఈఓ... అసభ్యకరమైన మెసేజ్‌లు పంపడంతో పాటు వాట్సాప్ ద్వారా వీడియో కాల్ చేసి వేధిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా, ఈ కేసు నుంచి ఎంఈఓను తప్పించేందుకు స్థానిక టీడీపీ నేతలు పోలీస్ స్టేషన్‌లో దుప్పటి పంచాయితీ నిర్వహించారు. అయితే బాధితురాలు ఒప్పుకోకపోవడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

బాబయ్య దర్గా పీఠాధిపతిగా సలావుద్దీన్‌బాబా



పీఠాధిపతిగా ఆశీనులైన సలావుద్దీన్ బాబా

పెనుకొండ: ప్రసిద్ధిగాంచిన పెనుకొండ బాబయ్య దర్గా 22వ పీఠాధిపతిగా ప్రస్తుత పీఠాధిపతి తాజ్‌బాబా పెద్ద కుమారుడు నజర్ హుస్సేని అలియాస్ సలావుద్దీన్ బాబా నియమితులయ్యారు. గత 36 సంవత్సరాలుగా దర్గా పీఠాధిపతిగా తాజ్‌బాబా బాధ్యతలు నిర్వర్తించారు. వంశపారంపర్యంగా వస్తున్న పీఠాధిపతి స్థానాన్ని తన కుమారుడు సలావుద్దీన్‌బాబాకు ఆయన అప్పగించారు. మంగళవారం సాయంత్రం పీఠాధిపతి స్థానంపై సలావుద్దీన్‌బాబా ఆశీనులయ్యారు. ఈ సందర్భంగా పలువురు మత పెద్దలు, భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

మహాకుంభమేళాకు ప్రత్యేక రైలు

రాయదుర్గం టౌన్: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో 2025 జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు జరిగే మహా కుంభమేళాకు నెలలో రెండు ట్రిప్పుల చొప్పున రాయదుర్గం, బళ్లారి మీదుగా మైసూరు-దానాపూర్-మైసూర్ ప్రత్యేక రైలును నడపనున్నారు. ఈ మేరకు సౌత్ వెస్ట్రన్ రైల్వే హుబ్లీ డివిజన్ చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ మంజునాథ మంగళశారం ఓ ప్రకటన విడుదల చేశారు. జనవరి 18, ఫిబ్రవరి 15, మార్చి 1 తేదీ శనివారాల్లో మైసూరులో సాయంత్రం 4.30 గంటలకు రైలు (06207) బయలుదేరి బెంగళూరు, చిత్రదుర్గం, రాయదుర్గం, బళ్లారి కంటోన్మెంట్, హుబ్లీ, విజయపుర, సత్నా, ప్రయాగ్‌రాజ్ మీదుగా దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జంక్షన్‌కు చేరుకుంటుంది. అలాగే జనవరి 22న, ఫిబ్రవరి 19, మార్చి 5న వేకువజాము 1.45 గంటలకు బయలుదేరే రైలు (06208) అదే స్టేషన్ల మీదుగా మైసూరుకు చేరుకుంటుంది.

పేదల గూడుపై పచ్చ నీడ

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 'పచ్చ' నేతలు రచ్చ చేస్తున్నారు. దాడులు, దందాలతో సామాన్యులపై జులుం ప్రదర్శిస్తున్నారు. ఇంకొందరు నేతలు అధికారాన్ని ఉపయోగించుకుని ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకుంటున్నారు. పేదలు ఇళ్లు నిర్మించుకునేందుకు ఇచ్చిన భూములకూ నకిలీ పట్టాలు సృష్టించి దౌర్జన్యానికి తెగబడ్డారు. ఇలా ఓ తెలుగు తమ్ముడు బుక్కపట్నం మండలంలో అసాంఘిక శక్తిగా మారాడు. 1995లో నిరుపేదలకు ఇచ్చిన భూమిని కబ్జా చేశాడు. తహసీల్దార్ సాయంతో నకిలీ పట్టాలు సృష్టించి ఆన్‌లైన్‌లో పేర్లు మార్చేశాడు.



టీడీపీ నాయకుడు నకిలీ పట్టాలు సృష్టించిన నార్శింపల్లి తండాలోని భూమి

నార్శింపల్లి గిరిజన కాలనీలో కబ్జా పర్వం

- పేదల స్థలాలను ఆక్రమించిన టీడీపీ బూత్ కన్వీనర్ రాజేష్
- అధికారుల అండతో ఆన్‌లైన్‌లో పేర్ల మార్పు
- తన పేరుతో పట్టా... పాసు పుస్తకం పొందిన టీడీపీ నేత
- అక్రమాలకు మద్దతు తెలిపిన తహసీల్దార్ షాబుద్దీన్

మిగులు భూములపై కన్ను

బుక్కపట్నం తహసీల్దార్ కార్యాలయాన్నే అడ్డాగా మార్చుకున్న టీడీపీ నేతలు... తహసీల్దార్ షాబుద్దీన్ సహకారంతో మండలంలో ప్రభుత్వ మిగులు భూములను కొట్టేసేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో ఇప్పటికే వందల ఎకరాలకు పట్టాలు పొందినట్లు తెలుస్తోంది.

సాక్షి టాస్క్ ఫోర్స్: బుక్కపట్నం మండలం కొత్తకోట రెవెన్యూ గ్రామ పరిధిలోని నార్శింపల్లి తండాలోని నిరుపేదల భూములపై ఓ టీడీపీ నాయకుడు కన్నేశాడు. గ్రామ సర్వే నంబర్ 1030-2వ లెటర్‌లోని 5 ఎకరాల్లో 1995లో అప్పటి సీఎం ఎన్టీ రామారావు తండా వాసులకు పట్టాలిచ్చారు. ప్రస్తుతం ఇక్కడ సుమారు 100 మంది ఇళ్లు నిర్మించుకుని కుటుంబాలతో జీవనం సాగిస్తున్నారు.

రిజిస్ట్రేషన్ కూడా పూర్తి

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2022లో నిరుపేదలకు మేలు జరిగేలా నిర్ణయం తీసుకుంది. రూ.10 వేలు కడితే ఇళ్ల పట్టాలు పొందిన వారికి రిజిస్ట్రేషన్ చేయించింది. ఈ క్రమంలోనే నార్శింపల్లి తండాలో పట్టాలు పొందిన వారిలో 10 మందికిపైగా లబ్ధిదారులు రూ.10 వేలు చెల్లించి గ్రామ సచివాలయాల ద్వారా బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తమ పట్టాలను రిజిస్ట్రేషన్ కూడా చేయించారు.

రికార్డులు తారుమారు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే టీడీపీ నేతలు ప్రభుత్వ భూములపై పడ్డారు. అధికారులను మచ్చిక చేసుకుని ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములున్నాయి... ఎక్కడ మిగులు భూములున్నాయంటూ ఆరా తీశారు. ఈ క్రమంలోనే నార్శింపల్లి తండాపై వారి కళ్లు పడ్డాయి. అక్కడ అప్పటికే 100 మంది ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నా... ఎలాగైనా స్వాధీనం చేసుకోవాలని ప్లాన్ వేశారు. ఈ క్రమంలో సర్వే నంబర్ 1030-2వ లెటర్ భూమి రికార్డులు తారుమారు చేశారు. అనంతరం రికార్డుల్లో సదరు స్థలాన్ని మిగులు భూమిగా చూపించి... 4.09 ఎకరాలను కొత్తకోట టీడీపీ బూత్ కమిటీ కన్వీనర్ నగరి రాజేష్ పేరుతో పట్టా జారీ చేసి అడంగల్‌లో సైతం ఎక్కించారు. ఇందుకు తహసీల్దార్ షాబుద్దీన్ పూర్తి స్థాయిలో సహకరించినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా నగరి రాజేష్‌కు ఈనెల 10వ తేదీన వన్-బీ కూడా మంజూరు చేశారు. దీంతో ఆ స్థలంలో ఇప్పటికే స్థిరనివాసాలు ఏర్పాటు చేసుకున్న 100 కుటుంబాలు తీవ్ర ఆందోళన చెందుతున్నాయి. దాదాపు మూడు దశాబ్దాల క్రితం తమకిచ్చిన స్థలానికి ఇప్పుడు పట్టాలు ఎలా ఇస్తారంటూ తండా వాసులు ప్రశ్నిస్తున్నారు.



నగరి రాజేష్ పేరుతో ఉన్న వన్-బీ



ఇళ్ల స్థలాలు రిజిస్టర్ అయినట్లు చూపుతున్న ఈసీ

కృష్ణాపురం, రామసాగరంలోనూ తమ్ముళ్ల భూ దందా

మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామ సచివాలయానికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని అదే గ్రామానికి చెందిన టీడీపీ నేత కట్లపాటి నారాయణస్వామి కబ్జా చేసి అక్రమంగా పునాది వేసుకున్నాడు. అలాగే రామసాగరంలోనూ టీడీపీ నేతలు రూ.30 లక్షల విలువైన చెరువు వంక పోరంబోకును ఆక్రమించి చదును చేసుకున్నారు.

తహసీల్దార్ డ్రైవర్‌దే కీలక పాత్ర

బుక్కపట్నం మండలంలో జరుగుతున్న భూకబ్జా బాగోతంలో తహసీల్దార్ డ్రైవర్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ఏ పని కావాలన్నా ముందుగా తహసీల్దార్ డ్రైవర్‌ను కలిసి ఆయన డిమాండ్ చేసినంత ఇచ్చుకుంటే పని అయిపోతుందని స్థానికులు చెబుతున్నారు. లేకపోతే నెలల తరబడి తిరిగినా పనులు కావడం లేదంటున్నారు. తహసీల్దార్ డ్రైవర్‌కు తోడుగా ఇటీవల మరో ముగ్గురు టీడీపీ నేతలు కూడా తహసీల్దార్ కార్యాలయంలోనే తిష్ట వేసి వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే వారితో భారీగా వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మొత్తంగా బుక్కపట్నం తహసీల్దార్ కార్యాలయం కాస్తా టీడీపీ ఆఫీసుగా మారిందని, కార్యాలయానికి ఎప్పుడు వెళ్లినా తహసీల్దార్ షాబుద్దీన్ టీడీపీ నేతలతో పిచ్చాపాటీగా మాట్లాడుకుంటూ కనిపిస్తారని జనం చెబుతున్నారు. అందువల్లే చాలా మంది తహసీల్దార్‌ను కలవకుండానే వెళ్లిపోతున్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి



ప్రభుత్వం మాకు ఇచ్చిన భూమిని కబ్జా చేసిన టీడీపీ నేతలు, వారికి సహకరించిన రెవెన్యూ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. అలాగే దీనిపై ఉన్నతాధికారులతో విచారణ జరిపించాలి. మూడు దశాబ్దాల క్రితం మాకిచ్చిన భూములను ఆక్రమిస్తున్నారంటే టీడీపీ నేతలు ఎంతకు తెగించారో తెలుస్తోంది. ఎమ్మెల్యే పల్లె సింధూరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి స్పందించి టీడీపీ నేతల భూ అక్రమాలపై విచారణ చేయించాలి. – సుధాకర్‌నాయక్, నార్శింపల్లి తండా, బుక్కపట్నం మండలం

తిరుగుబాటు తప్పదు



మేము మూడు దశాబ్దాలుగా నార్శింపల్లి తండాలో ఇళ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నాం. మా కాలనీలో 100 ఇళ్లకుపైగా ఉన్నాయి. నిరుపేదలకు ప్రభుత్వం ఇచ్చిన స్థలాన్ని మిగులు భూమిగా పేర్కొంటూ టీడీపీ నేతలకు అధికారులు అక్రమంగా పట్టాలిచ్చారు. వన్-బీ సైతం మంజూరు చేయటం అన్యాయం. మా స్థలం జోలికొస్తే తిరుగుబాటు తప్పదు. – మునిబాయి, నార్శింపల్లి తండా, బుక్కపట్నం మండలం

ఫ్రీ హోల్డ్ సర్వే పక్కాగా సాగాలి

- తప్పులు దొర్లితే కఠిన చర్యలు : కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: జిల్లాలో జరుగుతున్న ఫ్రీ హోల్డ్ సర్వే పక్కాగా సాగాలని, ఎక్కడైనా తప్పులు దొర్లితే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ టీఎస్ చేతన్ హెచ్చరించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని కోర్టు హాలు నుంచి వివిధ రెవెన్యూ అంశాలపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఫ్రీ హోల్డ్ వెరిఫికేషన్ శుక్రవారం లోపు పూర్తి చేయాలన్నారు. ఇప్పటికీ కొన్ని డివిజన్లలో పరిశీలన నత్తనడకన సాగుతోందని, వెంటనే సంబంధిత ఆర్డీఓలు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్డీఓలంతా తహసీల్దార్లను సమన్వయం చేసుకుని క్షేత్రస్థాయిలో ఫ్రీహోల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని మండలాల్లో పెండింగ్‌లో ఉన్న 22ఏ జాబితా ఈ నెల 23వ తేదీ లోపు పూర్తి చేయాలన్నారు. తహసీల్దార్లు కింది స్థాయి సిబ్బందికి రోజువారీ లక్ష్యాలను నిర్దేశించి వాటిని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్‌ఓ విజయసారథి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి ఆర్డీఓలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

నియోజకవర్గానికో నగరవనం

జిల్లాలో అటవీ విస్తీర్ణం పెంచేందుకు తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. నగర సుందరీకరణ చర్యల్లో భాగంగా నియోజకవర్గానికో నగరవనం ఏర్పాటు చేయాలన్నారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో అటవీ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇటీవల ముఖ్యమంత్రితో జరిగిన కలెక్టర్ల సదస్సులో జిల్లాలో అడవుల విస్తీర్ణం పెంచడంతో పాటు పచ్చదనం పెంపొందించే చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారని, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అటవీశాఖ అధికారులను ఆదేశించారు. అటవీ శాఖ అధికారులు, రెవెన్యూ, గ్రామీణ ఉపాధి హామీ అధికారులను సమన్వయం చేసుకుని అడవుల్లో కాంటూరు కందకాలు, రాక్ ఫీల్ డ్యాములు, చిన్న చిన్న నీటి గుంతలు ఏర్పాటు చేయాలన్నారు. 2025-2030కి సంబంధించి అటవీకరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. అలాగే జిల్లా మీదుగా వెళ్లే అన్ని జాతీయ రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమం విస్తృతం చేయాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి చక్రపాణి, సామాజిక వన విభాగం అధికారి వినోద్ కుమార్, సబ్ డీఎఫ్‌ఓ అనంద్ తదితరులు పాల్గొన్నారు.

'సూర్యఘర్'పై విస్తృత అవగాహన కల్పించాలి

'పీఎం సూర్యఘర్' పథకంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కోర్ట్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన 'సీఎం సూర్యఘర్' పథకం అమలుపై డీఎల్సీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 'సూర్యఘర్' పథకం అమలులో భాగంగా మోడల్ సోలార్ విలేజ్‌ను గుర్తించాలన్నారు. ఈ పథకానికి దరఖాస్తుల లక్ష్యాన్ని 10 వేలకు పెంచాలన్నారు. గ్రామ సభలు నిర్వహించి సోలార్ విద్యుత్ ఉత్పత్తితో వినియోగదారుడు అదనపు ఆదాయం పొందవచ్చన్న అంశాన్ని తెలియజేయాలన్నారు. సోలార్ గ్రామాలకు కేంద్రం రూ.కోటి ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ సురేంద్రబాబు, సంప్రదాయేతర ఇంధన వనరుల అధికారి కిషోర్, గ్రామ/వార్డు సచివాలయాల నోడల్ అధికారి సుధాకర్ రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి హరికిరణ్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జ్యోతుల ఉత్సవం



జ్యోతులతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు



ప్రత్యేక అలంకరణలో బేవినహళ్లి కరియమ్మదేవి

రొళ్ల: మండలంలోని జీజీహట్టి గ్రామంలో మంగళవారం బేవినహళ్లి కరియమ్మదేవి జ్యోతుల ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మూడేళ్లకు ఒకసారి జరిగే ఈ ఉత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కర్ణాటకలోని శిర నియోజకవర్గం గౌడగెర హోబళి బేవినహళ్లి గ్రామంలో వెలసిన కరియమ్మదేవి ఉత్సవ విగ్రహాన్ని సోమవారం సాయంత్రమే ఊరేగింపుగా జీజీ హట్టి గ్రామానికి తీసుకువచ్చి యత్తప్పస్వామి ఆలయ ప్రాంగణంలో పట్టంపై కూర్చోబెట్టారు. మంగళవారం ఉదయం యత్తప్పస్వామి ఆలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో కరియమ్మదేవి ఉత్సవ విగ్రహాన్ని తీసుకువచ్చి అధిష్ఠింపజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు జ్యోతులను మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకువచ్చి విగ్రహం చుట్టూ ప్రదక్షిణలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. వేడుకల్లో స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన యాదవులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, పార్టీ ముఖ్య నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

జనంపై 'చలి' పంజా

- రికార్డుస్థాయిలో పడిపోతున్న రాత్రి ఉష్ణోగ్రతలు



అనంతపురం అగ్రికల్చర్: చలి పంజా విసురుతోంది. రోజురోజుకు చలితీవ్రత పెరుగుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రాత్రి ఉష్ణోగ్రతలు పతనమవుతున్నాయి. మంగళవారం మరింత కనిష్ట స్థాయికి చేరుకున్నాయి. మడకశిరలో 9.3 డిగ్రీలు, కుందుర్పిలో 10 డిగ్రీల నమోదుతో ఈ సీజన్‌లో కనిష్టం రికార్డయ్యాయి. అలాగే, బెళుగుప్ప 10.1 డిగ్రీలు, కంబదూరు 10.3, గుత్తి 10.4, శెట్టూరు 10.9, గుమ్మఘట్ట 11.1, కళ్యాణదుర్గం, బ్రహ్మసముద్రంలో 11.7 డిగ్రీలు నమోదు కాగా మిగతా మండలాల్లో 12 నుంచి 15 డిగ్రీల లోపు నమోదయ్యాయి. అటు శ్రీ సత్యసాయి జిల్లాలోని పరిగిలో 10.7 డిగ్రీలు, సోమందేపల్లి 10.9, గుడిబండ 11.2, అగళి 11.3, చిలమత్తూరు 11.4, రొద్దం 11.5, అమరాపురం 11.6 డిగ్రీలు నమోదు కాగా మిగతా మండలాల్లో 12 నుంచి 14 డిగ్రీల మధ్య రికార్డయ్యాయి. మడకశిర, హిందూపురం, పెనుకొండ, కళ్యాణదుర్గం ప్రాంతాలు చలిగుప్పిట్లో వణుకుతుండగా రాయదుర్గం, గుంతకల్లు, ఉరవకొండ, అనంతపురం డివిజన్లలో కూడా తీవ్రత అధికంగా ఉంది. సాయంత్రం 6 నుంచి మరుసటి రోజు ఉదయం 9 గంటల వరకు కూడా పొగమంచు కారణంగా చీకట్లు అలుముకుంటున్నాయి. నీరెండ కారణంగా పగలంతా కూడా చలి వాతావరణం కనిపిస్తోంది.

జాగ్రత్తలు తప్పనిసరి: అతి శీతల పరిస్థితులు అన్ని వర్గాలను వణికిస్తున్నాయి. పిల్లలు, వృద్ధులు, ఆస్తమా, గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులు, రైతులు, శ్రామికులు, పాలు, కూరగాయల అమ్మకందారులు మరింత ఇబ్బంది పడుతున్నారు. చలి బారి నుంచి రక్షించుకునేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఏసీలు, ఫ్యాన్లు తగ్గించేయాలని సూచిస్తున్నారు. మఫ్లర్లు, మంకీక్యాప్, మాస్కులు, గ్లౌజులు, ఉన్ని సంబంధిత దుస్తులు వాడాలి. విటమిన్-డీ లోపం ఉన్నవారు ఎండలో వాకింగ్ చేయాలి. కాచివడబోసిన నీళ్లు తాగాలని, వేడి, తాజా ఆహార పదార్థాలు తీసుకోవాలి. జలుబు, దగ్గు, జ్వరాల బారి నుంచి రక్షించుకోవాలి.

ఖైదీల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి

- డీఎల్ఎస్ఏ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్

కదిరి టౌన్: ఖైదీల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ఎప్పటికప్పుడు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ స్థానిక సబ్‌జైలు అధికారులను ఆదేశించారు. మంగళవారం డీఎల్ఎస్ఏ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ స్థానిక సబ్‌జైలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. 70 ఏళ్ల వయస్సు ఉన్న ఖైదీలు, అనారోగ్యంతో బాధపడుతున్న ఖైదీలతో మాట్లాడారు. అనంతరం వంటశాల గదులు, ఖైదీలు ఉండే బ్యారక్‌లను పరిశీలించారు. పలు రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట న్యాయవాదులు లింగాల లోకేశ్వర్‌రెడ్డి, సిరాజుద్దీన్, దశరథ నాయక్, రఘునాథ్, జైలు సూపరింటెండెంట్ వాసుదేవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాలుడి అదృశ్యం



తల్లిదండ్రులతో అహమ్మద్ అల్మాన్ (వృత్తంలో)

పెనుకొండ: స్థానిక బాబయ్య దర్గా సమీపంలోని షెడ్‌లో మంగళవారం ఆడుకుంటున్న నాలుగేళ్ల వయసున్న అహమ్మద్ అల్మాన్ కనిపించకుండా పోయాడు. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని చిత్రదుర్గకు చెందిన జాఫర్ తన కుటుంబ సభ్యులతో కలసి బాబయ్య ఉరుసుకు వచ్చారు. మంగళవారం సాయంత్రం 4 గంటల సమయంలో షెడ్‌లో ఆడుకుంటున్న అహమ్మద్ అల్మాన్ కాసేపటి తర్వాత కనిపించకుండా పోయాడు. దీంతో తల్లిదండ్రులు గాలింపు చేపట్టినా ఫలితం దక్కలేదు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది రంగంలో దిగి బాలుడి ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. బాలుడు మంకీ క్యాప్, జెర్కిన్, వైట్ నిక్కర్, వైట్ టీషర్ట్ ధరించాడని, ఆచూకీ తెలిసిన వారు 94407 96842 (ఎస్‌ఐ), 94407 96841 (సీఐ), 70223 09672 (బాలుడి తండ్రి)కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

యువకుడి అనుమానాస్పద మృతి

యల్లనూరు: మండల కేంద్రానికి చెందిన కడిమన్నగారి బాలయ్య పెద్ద కుమారుడు సురేష్(35) మంగళవారం వైఎస్సార్ జిల్లా ఆర్‌ఎస్ కొండాపురం మండలం లావనూరు సమీపంలోని వంక కల్వర్టులో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న ఆయనకు పదేళ్ల క్రితం వివాహమైంది. భార్య వీరకుమారి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆశా కార్యకర్తగా వీరకుమారి పనిచేస్తోంది. ఈ క్రమంలో ఏడాది క్రితం మనస్పర్థలు చెలరేగడంతో దంపతులు వేర్వేరుగా ఉంటున్నారు. సోమవారం రాత్రి స్నేహితులతో కలసి ఆర్‌ఎస్ కొండాపురం వెళుతున్న చెప్పి ఇంటి నుంచి బయలుదేరిన సురేష్ మంగళవారం ఉదయం విగతజీవిగా కనిపించడంతో తల్లిదండ్రులు, బంధువులు బోరున విలపించారు. సురేష్ మృతిపై తండ్రి అనుమానాలు వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో ఆర్‌ఎస్ కొండాపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

> వారందరూ యువకులే. ఓ రెస్పాన్సిబిలిటీ లేదు. బెట్టింగ్‌ల మోజులో వారెళ్లే దారికి ఓ రూటంటూ ఉండదు. ప్రాణాలు పణంగా పెట్టి బైక్‌పై వారు వెళ్లే వేగానికి ఓ రూలూ ఉండదు. అడ్డగోలుగా రయ్యిమంటూ దూసుకెళ్లడమొక్కటే తెలుసు. అదేదో సినిమాలో బాలయ్య చెప్పినట్లుగా... 'ఒకడు నాకు ఎదురైనా వాడికే రిస్క్, ఒకడికి నేను ఎదురెళ్లినా వాడికే రిస్క్, తొక్కి పడేస్తా' అనే రీతిలో ఇతర వాహనదారులనూ ప్రమాదాల బారిన పడేస్తున్నారు. బైక్ రేసర్ల ఆగడాలు పెచ్చుమీరడంతో 44వ జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.



నాలుగు రోజుల క్రితం పులేకమ్మ గుడి వద్ద కారును బైక్ రేసర్ ఢీకొనడంతో స్తంభించిన ట్రాఫిక్

- వారాంతాల్లో విచ్చలవిడిగా రేసింగ్‌లు
- ప్రమాదకర స్కిట్‌లు, స్పీడ్ డ్రైవింగ్
- చోద్యం చూస్తున్న పోలీసులు
- బిక్కుబిక్కుమంటున్న వాహన చోదకులు

బెట్టు కట్టి.. ప్రాణం పణంగా పెట్టి

చెలరేగిపోతున్న బైక్ రేసర్లు



పెనుకొండ సమీపంలో 44వ జాతీయ రహదారిపై బైక్ రేసర్ దూకుడు

పెనుకొండ: జిల్లాలో బైక్ రేసర్లు రెచ్చిపోతున్నారు. ఇప్పటివరకూ గుట్టుచప్పుడు కాకుండా సాగిన రేసింగ్‌లను ఇప్పుడు ఎప్పుడుపడితే అప్పుడు ఓపెన్ ఛాలెంజ్‌గా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఎక్కడైనా ఎవరైనా అడ్డుకునే ప్రయత్నం చేస్తే దాడులకు కూడా తెగబడుతున్నారు.

రూ.లక్షకు పైగా బెట్టింగ్

వారాంతం వస్తే 44వ జాతీయ రహదారిపై విమానం మోతతో ద్విచక్రవాహనాల్లో బెంగళూరు నుంచి పెనుకొండకు బైక్ రేసర్లు దూసుకువస్తున్నారు. పర్యాటక సందర్శన మాట ఎలా ఉన్నా.... భారీ బెట్టింగ్‌లతో బెంగళూరు నుంచి పెనుకొండకు బైక్ రేసర్లు చేరుకుంటున్నట్లు తెలిసింది. వీరిని చూసిన స్థానిక యువకులు సైతం అదే తరహాలో బైక్‌లపై దూసుకెళ్లడం మొదలు పెట్టారు. ఆరేడు నెలలుగా వారాంతాల్లో పెనుకొండ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై స్నేక్ రైడింగ్, స్పీడ్ రైడింగ్, జిగ్‌జాగ్ డ్రైవింగ్, సింగిల్ హ్యాండ్ విత్ సింగిల్ లెగ్ డ్రైవింగ్ వంటి పేర్లతో రేసింగ్‌లు పెట్టుకుంటున్నారు. ఈ రేసింగ్ వెనుక భారీ మొత్తంలో బెట్టింగ్‌కు పాల్పడుతున్నారు. ఒక్కో రేస్‌కు రూ.20 వేల నుంచి రూ.లక్షకుపైగా బెట్టింగ్ జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ రేస్‌లపై పైపందెం కాసేందుకు పెనుకొండ పట్టణంతో పాటు శ్రీకృష్ణదేవరాయ జంక్షన్ వద్ద చాలా మంది యువకులు గుమిగూడుతున్నారు. ఈ బెట్టింగ్ వ్యవహారం ప్రస్తుతం తారాస్థాయికి చేరుకుంది. వారాంతపు రెండు రోజుల్లోనూ రూ.25 లక్షల నుంచి రూ.60 లక్షల వరకూ చేతులు మారుతున్నట్లు సమాచారం.

ప్రమాదాలకు కారణం

కొన్ని నెలల క్రితం బైక్ రేసింగ్ సరదా పరిగి మండలంలో ఓ వ్యక్తి ప్రాణాలను బలిగొంది. హిందూపురం నుంచి తన కుమార్తెను పిలుచుకుని స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమైన ఓ ప్రభుత్వ ఉద్యోగిని పరిగి శివారున ఓ బైక్ రేసర్ బలంగా ఢీకొని, అదే వేగంతో ఉడాయించాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆ ప్రభుత్వ ఉద్యోగి బెంగళూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇలాంటి ఘటనలు ఎన్నో చోటు చేసుకుంటున్నా... వెలుగు చూస్తున్నవి మాత్రం కొన్నే కావడం గమనార్హం. అది కూడా రోడ్డు ప్రమాదం కేసులుగా నమోదవుతున్నట్లు తెలిసింది. నాలుగు రోజుల క్రితం జరిగిన బైక్ రేసింగ్‌లో పెనుకొండ సమీపంలోని పులేకమ్మ గుడి వద్ద ఓ కారును బైక్ రేసర్ ఢీకొన్నాడు. ఘటన అనంతరం కారును మరమ్మతు చేయించుకునేందుకు యజమాని పెద్ద మొత్తంలో ఖర్చు పెట్టుకోవాల్సి వచ్చింది. దీంతో బైక్ రేసర్ల ఆగడాలకు జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే ఇతర వాహనదారులు ఇక్కట్ల పాలవుతున్నారు.



రాంగ్ రూట్‌లో వస్తున్న బైక్ రేసర్

నిఘా పెట్టాం

బైక్ రేసింగ్, బెట్టింగ్‌లపై ప్రత్యేక నిఘా పెట్టాం. ఇందు కోసం నలుగురు ఎస్‌ఐలతో కూడిన ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. ఇప్పటికే పలువురిని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చాం. బైక్ రేసింగ్, బెట్టింగ్‌కు పాల్పడుతున్న వారిలో అత్యధికులు కర్ణాటక ప్రాంతానికి చెందినవారుగా తెలిసింది. బైక్ రైడ్ చేస్తున్న వారిలో 90 శాతం మంది మైనర్లే ఉన్నారు. వీరిని పట్టుకునేందుకు ప్రయత్నిస్తే ఎక్కడ లారీలు, కార్లను ఢీకొంటారనే భయంతో ఉన్నాం. రానున్న రోజుల్లో బైక్ రేసింగ్, బెట్టింగ్‌లపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– రాఘవన్, సీఐ, పెనుకొండ

కనిపించని పోలీసుల చర్యలు

తమ ప్రాణాలను పణంగా పెట్టి బెట్టింగ్‌లతో బైక్ రేసింగ్‌లకు పాల్పడుతున్న యువకుల ఆగడాలను అరికట్టడంలో జిల్లా పోలీసు యంత్రాంగం పూర్తిగా విఫలమైందనే ఆరోపణలున్నాయి. రేసింగ్ ఎప్పుడు జరుగుతుంది.... ఎంత మేరకు బెట్టింగ్ జరుగుతుంది... ఎవరు నిర్వహిస్తున్నారు... తదితర వివరాలు తెలిసినా చర్యలు తీసుకునేందుకు పోలీసులు వెనుకంజవేస్తున్నారు. అత్యవసర పనిపై కాస్త వేగంతో వెళుతున్న వారిని పట్టుకుని యక్ష ప్రశ్నలతో వేధించే పోలీసులు.. బైక్ రేసింగ్, బెట్టింగ్‌లపై నోరు మెదపకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వృద్ధురాలి ఆత్మహత్య



మృతురాలు పార్వతీబాయి

పెనుకొండ రూరల్: మండలంలోని గోనిపేట గ్రామానికి చెందిన పార్వతీబాయి (64) ఆత్మహత్య చేసుకుంది. గత కొన్ని రోజులుగా మతిస్థిమితం లేని ఆమె మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమెకు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు శ్రీరాం నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

నేడో, రేపో విధుల్లోకి జెడ్పీ సీఈఓ

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ సీఈఓ రామచంద్రారెడ్డి ఒకట్రెండు రోజుల్లో విధుల్లో చేరనున్నారు. రెండున్నర నెలల క్రితం నంద్యాల జిల్లా డ్వామా పీడీగా ఉన్న ఆయనను అనంతపురం జెడ్పీ సీఈఓగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే అప్పట్లో ఆయన రెండు నెలల పాటు సెలవులో ఉండడంతో విధుల్లోకి చేరలేకపోయారు. 20 రోజుల క్రితం అమెరికా నుంచి స్వస్థలం వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చేరుకున్నారు. ఈ నెల 2న సీఈఓగా బాధ్యతలు చేపట్టాల్సి ఉన్నా ఆయన రాలేదు. సెలవు పొడిగించుకున్నారు. ఈ నేపథ్యంలో కొందరు శ్రేయోభిలాషుల సూచనల మేరకు అనంతపురం సీఈఓగా చేరేందుకు ఆయన సుముఖత చూపినట్లు తెలిసింది.

బొలెరో ఢీకొని యువకుడి మృతి

పరిగి: బొలెరో ఢీకొన్న ఘటనలో ఓ ద్విచక్ర వాహనదారుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... పరిగి మండలం శాసనకోట గ్రామానికి చెందిన ఉప్పర రాజప్ప కుమారుడు నవీన్ (19) అయ్యప్ప మాలధారణ చేశాడు. ఈ క్రమంలో తన గ్రామానికి చెందిన సందీప్, విష్ణు (అయ్యప్ప మాలదారులు)తో కలసి పరిగి మండలం ఊటకూరు బసవనపల్లిలో సోమవారం రాత్రి జరిగిన పడిపూజ కార్యక్రమంలో పాల్గొనేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. జాతీయ రహదారిపైకి చేరుకోగానే వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన బొలెరో వాహనం ఢీకొంది. ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న ముగ్గురూ గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే హిందూపురంలోని జిల్లాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో బెంగళూరుకు తీసుకెళుతుండగా మార్గమధ్యంలో నవీన్ మృతి చెందాడు. మృతుడి తల్లి రత్నమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బార్ లైసెన్స్‌కు దరఖాస్తుల స్వీకరణ

పుట్టపర్తి టౌన్: పెనుకొండ నగర పంచాయతీ పరిధిలో ఖాళీగా ఉన్న ఒక బార్ నిర్వహణకు లైసెన్స్ జారీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి గోవిందనాయక్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2025, ఆగస్టు వరకూ అనుమతులు జారీ చేస్తారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఈ నెల 22తో ముగుస్తుంది. 23వ తేదీ వరకు ఆన్‌లైన్ ఫీజు చెల్లించవచ్చు. 23న స్క్రూట్నీ, 24న లాటరీ నిర్వహిస్తారు. పూర్తి వివరాలకు పుట్టపర్తిలోని జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ కార్యాలయ అధికారులను సంప్రదించవచ్చు.

దృష్టి ఏమార్చి... బంగారు చైన్ లాక్కెళ్లి!

రాప్తాడు రూరల్: దుకాణంలో ఉన్న మహిళ దృష్టిని ఏమార్చి ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లిన ఘటన అనంతపురం నగర శివారులో సంచలనం రేకెత్తించింది. వివరాలు... అనంతపురం రూరల్ మండల పరిధిలోని బళ్లారి రోడ్డు లలితానగర్‌లో నివాసముంటున్న సత్యేశ్వరరెడ్డి, హేమలత దంపతులు...వాటర్ ప్లాంట్‌తో పాటు కిరాణాకొట్టు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. మంగళవారం ఉదయం కిరాణాకొట్టులో ఉన్న హేమలత వద్దకు ఓ యువకుడు వచ్చి సిగిరెట్టు కావాలని అడిగాడు. సిగిరెట్టు ఏదని ఆమె అడుగుతుండగానే క్షణాల్లో ఆమె మెడలో నుంచి బంగారు చైన్ లాక్కొని ఉడాయించాడు. ఆ సమయంలో బాధితురాలు గట్టిగా కేకలు వేసినా ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. చుట్టుపక్కల పరిశీలించి జనసంచారం లేకపోవడంతో ఇద్దరు యువకులు ఈ చోరీకి పాల్పడి ఉంటారని అనుమానాలు వ్యక్తమయ్యాయి. కేసు నమోదు చేసిన పోలీసులు చుట్టుపక్కల అందుబాటులో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీల దర్యాప్తు చేపట్టారు.

వైద్య విద్యార్థి దుర్మరణం

రైల్వేకోడూరు అర్బన్: రైల్వేకోడూరు– శెట్టిగుంట జాతీయ ప్రధాన రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వైద్య విద్యార్థి దుర్మరణం పాలయ్యాడు. మృతుడిని తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలలో చదువుతున్న కదిరి నియోజకవర్గం నల్లమాడ తండాకు చెందిన మహేంద్ర నాయక్ (21)గా పోలీసులు గుర్తించారు. మంగళవారం బైక్‌పై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లిదండ్రులు తులసీధర్ నాయక్, తిరుపాల్ బాయికు విషయం తెలిపి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ పొదుపు.. భవితకు మలుపు

- ఇంధన వారోత్సవాల్లో కలెక్టర్ టీఎస్ చేతన్



ర్యాలీని జండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి టౌన్: విద్యుత్‌ను పొదుపుగా వాడుకుంటే భవితరాలకు ఎంతో మేలు జరుగుతుందని, అందువల్ల విద్యుత్ వినియోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ చేపట్టారు. కలెక్టరేట్‌లో ర్యాలీకి కలెక్టర్ టీఎస్ చేతన్ జెండా ఊపి ప్రారంభించగా, గణేష్ కూడలి వరకు కొనసాగింది. అక్కడ మానవహారంగా ఏర్పడి 'విద్యుత్‌ను పొదుపు చేద్దాం–భావితరాలకు భవిష్యత్ నిద్దాం' అంటూ నినాదాలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యుత్ పొదుపు చేయడం ద్వారా భవిష్యత్ తరాలకు భరోసా కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గృహోపకరణాలు ఉపయోగించే సమయంలో చిట్కాలు పాటించడం ద్వారా విద్యుత్ ఆదా చేయవచ్చన్నారు. అనంతరం ఏపీఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ సురేంద్ర మాట్లాడుతూ, నాణ్యమైన విద్యుత్ సరఫరాకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ డీఈ శివరాం, ఏడీ శర్వాణ్, ఏఈలు నారాయణమ్మ, శ్రీనివాసులుతో పాటు విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

'వందే భారత్' ఢీకొని 40 గొర్రెల మృతి



రైలు కింద పడి మృతి చెందిన గొర్రెలు

ధర్మవరం రూరల్: మండలంలోని బడన్నపల్లి వద్ద మంగళవారం సాయంత్రం దాసరి శివయ్యకు చెందిన 40 గొర్రెలు వందే భారత్ రైలు కింద పడి మృతి చెందాయి. మంగళవారం తనకున్న 150 గొర్రెలను దాసరి శివయ్య భార్య మల్లేశ్వరి మేపునకు సమీపంలోని రైలు పట్టాల వద్దకు తోలుకెళ్లింది. ఆ సమయంలో బెంగళూరు నుంచి వేగంగా హైదరాబాద్ వైపు వెళుతున్న వందే భారత్ రైలు శబ్దానికి గొర్రెలు బెదిరి ఒక్కసారిగా గుంపుగా పట్టాలపై పరుగు తీస్తూ 40 గొర్రెలు రైలు కిందపడి మృతి చెందగా, మరి కొన్ని తీవ్రంగా గాయపడ్డాయి.

అత్యాచారయత్నం కేసులో రిమాండ్‌కు నిందితులు

పరిగి: మండలంలోని మోదాలో ఏడేళ్ల క్రితం మహిళపై జరిగిన అత్యాచార యత్నం కేసులో నిందితులుగా ఉన్న దిలీప్, జోగిని పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ రంగడుయాదవ్ తెలిపిన మేరకు... 2017, డిసెంబర్ 17న మోదా సమీపంలోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్న దిలీప్, జోగి... అదే గ్రామానికి చెందిన ఓ మహిళపై అత్యాచార యత్నానికి పాల్పడ్డారు. ఈ క్రమంలో బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పట్లో పరిగి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పటి నుంచి నిందితులు కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకుని తిరుగుతున్నారు. ఈ క్రమంలో న్యాయమూర్తి ఆదేశాల మేరకు విస్తృత గాలింపు చేపట్టి మంగళవారం అదుపులోకి తీసుకుని హిందూపురంలోని న్యాయస్థానంలో హాజరుపరిచారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు నిందితులను రిమాండ్‌కు తరలించారు.

నెట్టికంటుడి హుండీ ఆదాయం రూ.62.36 లక్షలు



హుండీ నగదును లెక్కిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానానికి హుండీ కానుకల ద్వారా రూ. 62.36 లక్షల ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ కే.వాణి తెలిపారు. మంగళవారం ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఈఓ మాట్లాడుతూ 49 రోజులకు గానూ రూ. 62,36,139 నగదును భక్తులు స్వామివారికి సమర్పించినట్లు తెలిపారు. అలాగే, అన్నదానం హుండీ ద్వారా రూ.26,206 అందిందన్నారు. 7 గ్రాముల బంగారు, 1.630 కిలోల వెండి, కెనడా డాలర్లు 20, నేపాల్ రుపీస్ 205, సౌదీ అరేబియా రియాన్స్ 10 స్వామివారికి సమర్పించినట్లు పేర్కొన్నారు. గుంతకల్లు ఆర్డీసీ హనుమాన్ సేవాసమితి సభ్యులు, బళ్లారికి చెందిన వీరభద్రసేవా సమితి సభ్యులు హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ అధికారులు, సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ధర్మవరంలో వరుస చోరీలు



దుకాణాల వద్ద తచ్చాడుతున్న దొంగలు (సీసీ కెమెరా ఫుటేజీ)

ధర్మవరం: స్థానిక పుట్టపర్తి మార్గంలోని నాలుగు దుకాణాల్లో దుండగులు చొరబడి విలువైన సామగ్రి, నగదు అపహరించుకెళ్లారు. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ చోరీలు జరిగినట్లుగా తెలుస్తోంది. ప్రియాంకనగర్‌లో ని వరుస దుకాణాల షట్టర్‌లను వంచి చోరీలకు తెగబడ్డారు. పెణుజూరు సుబ్బరత్నమ్మ కాంప్లెక్స్‌లో ప్రభాకర్‌కు చెందిన ఆటోమొబైల్స్ షాప్‌లో రూ.15వేలు నగదు, మహేష్‌కు చెందిన హార్డ్‌వేర్ షాప్‌లో రూ.20వేలు, నాగార్జునకు చెందిన పెయింట్‌షాప్‌లో రూ.50వేలు నగదు, పవన్‌కు చెందిన గార్మెంట్స్‌షాప్‌లో రూ.15వేల నగదుతో పాటు పలు దుస్తులు, వస్తువులను అపహరించారు. మంగళవారం ఉదయం దుకాణాల నిర్వాహకుల నుంచి ఫిర్యాదులు అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి, సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ క్రమంలో ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

ద్విచక్ర వాహనాల ఢీ - బాలుడి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అబ్దుల్

అనంతపురం: నగర శివారులోని తపోవనం సమీపంలో ఉన్న రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో ఓ బాలుడు దుర్మరణం పాలయ్యాడు. మంగళవారం సాయంత్రం స్థానిక హెచ్చెల్సీలో ఈతకు వెళ్లిన పిల్లిగుండ్ల కాలనీకి చెందిన అబ్దుల్ (16)తో పాటు పవన్ కుమార్ బైక్‌లో వస్తుండగా ఎదురుగా వేగంగా వచ్చిన మరో బైక్ ఢీకొంది. ఘటనలో రోడ్డుపై పడిన అబ్దుల్ అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చొన్న పవన్‌కుమార్ కుడికాలికి గాయమైంది. ప్రమాదానికి కారణమైన యువకుడు జయంత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఘటనపై అనంతపురం ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

తెలంగాణ మద్యం పట్టివేత

తాడిపత్రి: తెలంగాణ నుంచి అక్రమంగా కారులో తరలిస్తున్న మద్యాన్ని తాడిపత్రి పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. సీఐ సాయిప్రసాద్ తెలిపిన మేరకు... తెలంగాణాకు చెందిన తాళ్ల గోపిరెడ్డి, మండే నరసింహారావు, తాడిపత్రి మండలం, బ్రాహ్మణపల్లికి చెందిన మిట్టమీద దస్తగిరి, నంద్యాల జిల్లా, వెంకటాపురానికి చెందిన సొంటి సుధాకర్ మంగళవారం 48 బ్లాక్‌డాగ్ ఫుల్ బాటిల్ మద్యం సీసాలను డిజైర్ కారులో తాడిపత్రికి తరలిస్తూ పట్టుబడ్డారు. నిందితులు నలుగురిని అరెస్ట్ చేసి, మద్యం బాటిళ్లతో పాటు కారును సీజ్ చేశారు. పట్టుబడిన మద్యం విలువ రూ.1.44 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

కాకినాడలో యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలు



కరపత్రాలు విడుదల చేస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం ఎడ్యుకేషన్: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) రాష్ట్ర మహాసభలు జనవరి 5 నుంచి 8వ తేదీ వరకూ తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం డీఈఓ ఎం.ప్రసాద్‌బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ... యూటీఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవ మహాసభలు జరుపుకోవడం సంతోషకరమన్నారు. యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ... రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఐక్య ఉద్యమాల్లో యూటీఎఫ్ కీలకపాత్ర పోషిస్తోందన్నారు. మహాసభల్లో 50 ఏళ్ల ఉద్యమ ప్రస్థానాన్ని సమీక్షించడంతో పాటు రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ పరిస్థితులు, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను లోతుగా అధ్యయనం చేసి రానున్న రోజుల్లో చేపట్టాల్సిన ఉద్యమాలు, పోరాటాలపై కార్యాచరణను రూపొందించనున్నామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య, రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప, జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్వీవీ రమణయ్య, సహాధ్యక్షుడు రామప్ప, నాయకులు సుబ్బరాయుడు, చంద్రమోహన్, మహమ్మద్ జిలాన్, నాగేంద్ర, చెన్నారెడ్డి, మెడికల్ రెప్స్ అసోసియేషన్ నాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.